దారుణంగా డొంక రోడ్లు!

- అవస్థలు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు
- కొత్తగా నిర్మించాలని రైతుల వినతి

గన్నవరం రూరల్: రైతుల రవాణా మార్గాలుగా ఉపకరించే డొంకరోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలమయంగా తయారయ్యాయి. కనీసం నడిచేందుకూ వీలు లేని విధంగా ఉన్నాయి. రైతులు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు డొంకరోడ్లలో ప్రయాణించేందుకు వీలు లేని విధంగా ఉన్నాయి. వీటిని బాగుచేయించాల్సిన ప్రభుత్వ శాఖలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి గ్రామంలోనూ డొంక రోడ్లు ఉన్నాయి. గన్నవరం మండలంలోని 21 గ్రామాలు ఉండగా, వీటిల్లో 18 వేల ఎకరాల్లో వరి సాగవుతుంది. ఉద్యానవన పంటలైన మామిడి, కూరగాయలు, ఇతర పంటలు 5వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రతి రోజు ఈ భూముల్లోకి వెళ్లాలంటే డొంక రోడ్లే దిక్కుగా ఉన్నాయి. ముస్తాబాద ఆయకట్టు 5వేల ఎకరాలకు పైగానే ఉంది. అదే విధంగా మాదలవారిగూడెం, సూరంపల్లి, సావరగూడెం, పురుషోత్తపట్నం, కొండపావులూరు, గొల్లనపల్లి, బీబీగూడెం, గోపవరపుగూడెం, చిక్కవరం తదితర గ్రామాల్లో డొంక రోడ్లు కనీసం ఊరికి 5 పైగా ఉన్నాయి. అంటే వంద పైగా డొంక రోడ్లు వ్యవసాయ అవసరాలకు రైతులు నిరంతరం వినియోగిస్తుంటారు. విత్తనం చల్లింది మొదలు పంట కోసే వరకూ, దానిని తరలించే వరకూ ఈ రోడ్లనే ఉపయోగిస్తుంటారు. విత్తనాలు తీసుకువెళ్ళేందుకు, దుక్కులు దున్నేందుకు, మందు చల్లేందుకు, సాగునీరు పెట్టేందుకు నిరంతరం ట్రాక్టర్‌లు ఈ రోడ్లపై నడుస్తుంటాయి.


అధ్వానంగా బీబీగూడెం డొంక రోడ్డు


బీబీగూడెం వద్ద పంట కాలువలో పెరిగిన కంప

ముళ్లచెట్లతో నిండిపోయి...

తెంపల్లి నుంచి బీబీగూడెం వచ్చే డొంకరోడ్లు దారుణంగా ఉన్నాయి. ముళ్ళచెట్లుతో రోడ్లు కుంచించుకుపోయాయి. పంటకాల్వలు సైతం ముళ్ల చెట్లతో నిండిపోయాయి. వీటిలో ప్రజలు వ్యర్థాలు వేస్తున్నారు. అన్ని గ్రామాల్లోనూ పరిస్థితి ఈ విధంగానే ఉంది. కనీసం ఈ వేసవిలో డొంక రోడ్ల దుస్థితిపై అధికారులు దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆక్రమణలు తొలగించాలి

పలు గ్రామాల్లో డొంక రోడ్లు ఆక్రమణలకు గురయ్యాయి. పంట కాలువలు పరిమాణం తగ్గిపోయాయి. ఏ గ్రామానికి ఆ గ్రామంలో వీఆర్వో చేత డొంక రోడ్లు, పంట కాలువలు సర్వే చేయించి కాపాడాలని రైతులు కోరుతున్నారు. సూరంపల్లి, ముస్తాబాద, మాదలవారిగూడెం గ్రామాల్లో పరిశ్రమల వ్యర్థాలు పంట కాలువల్లో, డొంక రోడ్లలో వేస్తున్నారు. ఈ పరిస్థితి మార్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఏటా వేసవిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల ద్వారా పంట కాలువలు బాగు చేస్తారు. ఈ సంవత్సరం డొంక రోడ్లు పక్కనే ఉన్న పంట కాలువలు బాగు చేయించాలని, ఆక్రమణలు తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామాల్లోకి వె వెళ్లే ప్రధాన రహదారుల వెంట పెద్దపెద్ద పంట కాలువలుంటాయి. వాటిని సర్వే చేసి ఆక్రమణల చెర నుంచి కాపాడాలని కోరుతున్నారు.



సర్వే చేసి కొత్తగా నిర్మించాలి

డొంక రోడ్లు సర్వే చేసి కొత్తగా నిర్మించాలి. వ్యవసాయం డొంక రోడ్లపైనే ఆధారపడి ఉంది. పండించిన ధాన్యం తరలించాలంటే ఈ రోడ్లే శరణ్యం. పంట కాలువలు కూడా బాగుజేయించాలి.

–మిరప నాగేశ్వరరావు, గన్నవరం



అంచనాలు రూపొందించాలి

రైతాంగానికి మేలు చేసే పంట కాలువలు, డొంక రోడ్లు ఆధునీకరించాలి. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా అంచనాలు వేయాలి. ఈ వేసవిలో రోడ్లు నిర్మాణం పూర్తి చేయాలి.

–మల్లంపల్లి ఆంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి

ఆధునిక సాంకేతిక విద్యపై దృష్టి పెట్టాలి


ప్రసంగిస్తున్న సత్యనారాయణ

పెనమలూరు: విద్యార్థులు ఆధునిక సాంకేతిక విద్యపై దృష్టి పెట్టి లక్ష్య సాధనకు శ్రమించాలని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్.సత్యనారాయణ తెలిపారు. సిద్ధార్థ అకాడమీ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ఆధునిక సాంకేతిక విద్యకు చాలా ప్రాముఖ్యత ఏర్పడిందన్నారు. ఏఐ, మెషిన్ లెర్నింగ్ వంటి సాంకేతిక విద్యకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. విద్యార్థులు స్కిల్స్ పెంచుకొని, ఆధునిక సాంకేతిక విద్యపై పట్టు సాధించితే లక్ష్యం చేరుకోగలుగుతారని వివరించారు. సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ తమ విద్యా సంస్థల్లో విద్యార్థులు పూర్తి స్థాయిలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని వెల్లడించారు. ఉత్తమ ప్రతిభ చాటే విద్యార్థులకు ఉపకార వేతనాలు కూడా అందిస్తున్నామని వివరించారు. తమ కాలేజీలో చదువుకున్న అనేక మంది విద్యార్థులు దేశ, విదేశాల్లో నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఫలితం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునే విధంగా చేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, ట్రెజరర్ ఎస్.వెంకటేశ్వరరావు, వైస్ ఛాన్సలర్ పి.వెంకటేశ్వరరావు, వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కానూరు చర్చిలో దేవభక్తుని ప్రత్యేక ప్రార్థనలు



పెనమలూరు: కానూరులో వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మురళీనగర్‌లో ఉన్న దైవస్వరూపి ప్రార్థనా మందిరంలో ఆదివారం జరిగిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో దేవభక్తుని చక్రవర్తి పాల్గొనగా ఫాదర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవభక్తుని చక్రవర్తి ఫాదర్‌ను సత్కరించారు. దేవభక్తుని కుటుంబం చాలా సంవత్సరాలుగా పేదలకు అందిస్తున్న సేవలను ఫాదర్ కొనియాడారు. చక్రవర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యంతో సుఖసంతోషాలతో ఉండాలని కోరారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం అవసరం



కంకిపాడు: ప్రతిభావంతులకు ప్రోత్సాహం అవసరమని సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ చాటిన కంకిపాడుకు చెందిన అన్నా చెల్లెళ్లు జవ్వాది రంజిత్‌కుమార్, జవ్వాది రమ్యరిషిత, గంగూరుకు చెందిన కన్నెకంటి చరణ్‌తేజలకు ఒక్కొక్కరికి రూ.5 వేలు నగదు ప్రోత్సాహం ఆదివారం అందించారు. కిషోర్‌బాబు మాట్లాడుతూ చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఎమ్మెస్సార్ డెవలపర్స్ నూతన వెంచర్ ప్రారంభం



నున్న(విజయవాడ రూరల్): ఎమ్మెస్సార్ డెవలపర్స్ నూతన వెంచర్‌ను నున్న గ్రామంలో ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెస్సార్ డెవలపర్స్ అధినేత మాధవరపు శ్రీనివాసరావు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వెంచర్ విజయవాడ, సింగనగర్ డి మార్ట్ సూపర్ మార్కెట్, నున్న మార్కెట్ మధ్యలో వెంచర్ ఉందన్నారు. 30 అడుగుల తారు రోడ్లు, విద్యుత్ సదుపాయంతో ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు కొండపల్లి, గుంటుపల్లి, సింగ్‌నగర్, పైడూరుపాడు ప్రాంతాల్లో వెంచర్‌లు విజయవంతంగా పూర్తిచేసినట్లు పేర్కొన్నారు.

16న దాసాంజనేయ స్వామి దేవస్థానం ప్రతిష్ట

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని కృష్ణా మిల్క్ యూనియన్ పాల ఉత్పత్తుల కార్మాగారం ప్రాజెక్టు కామధేను ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దాసాంజనేయ స్వామి దేవస్థానం ప్రతిష్ట మహోత్సవం ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎండీ కొల్లి ఈశ్వరబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు తెలిపారు. మహా పూర్ణాహుతి, పుణ్యాహవాచనం, కుంభ ప్రోషణ, తదితర హోమాలు జరుగుతాయని చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఆంజనేయ స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ఉచిత యోగా శిక్షణ తరగతులు

పటమట(విజయవాడతూర్పు): నేటి కాలంలో యోగా మంచి జీవన విధానం అని, క్రమం తప్పకుండా అందరూ అభ్యాసం చేయాలని గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. ఆదివారం పటమటలోని దత్త పీఠంలో జరిగిన దత్తక్రియ యోగా శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. యోగాసనాలపై అవగాహన కల్పించారు. దత్త క్రియాయోగ అంతర్జాతీయ కేంద్రం, మైసూర్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రకాష్ మాట్లాడుతూ నగరంలో మూడు రోజుల పాటు జరిగే ఈ యోగా శిక్షణ తరగతులు దత్తపీఠంలో ఉచితమన్నారు. ప్రతిరోజు కనీసం ఒక 40 నిమిషాల పాటు ధ్యానం చేయాలని తద్వారా ఎన్నో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు పొందవచ్చని ఆయన తెలిపారు. దత్త క్రియాయోగ పటమట ప్రాంత సమన్వయకర్త అరుణ మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు పటమటలోని శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశ్రమంలో నిత్య సాధనా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 9866041332లో సంప్రదించాలని సూచించారు.

కానూరులో ఘనంగా మానుకొమ్మల పండుగ


కానూరులో మానుకొమ్మలతో ప్రదర్శన చేస్తున్న ఫాదర్ శౌరి


కేసరపల్లిలో ప్రదర్శనలో పాల్గొన్న రెవరెండ్ ఫాదర్లు కిషోర్, సందీప్


ఉయ్యూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెనమలూరు: కానూరు కార్మిల్‌మాత పుణ్యక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం మానుకొమ్మల పండుగ ఘనంగా చేశారు. క్రైస్తవుల తపస్సు కాలం ఆదివారం కార్మెల్‌మాత పుణ్య క్షేత్రం నుంచి మానుకొమ్మలతో భక్తులు కామయ్యతోపు, బందరు రోడ్డు, కానూరు పురవీధుల్లో భక్తి శ్రద్ధలతో ప్రదర్శన నిర్వహించారు. భక్తి గీతాలు ఆలపించారు. దివ్య బలిపూజ, దివ్య సంస్కారాలు, దైవార్చన నిర్వహించారు. భక్తులకు ఫాదర్స్ మైత్రి దేవదానం, రత్నరాజు దివ్య ప్రసాదం అందచేశారు. ఈ కార్యక్రమంలో పోరంకి, కానూరు, గంగూరు భక్తులతో పాటు సీటీసీ సిస్టర్స్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మానుకొమ్మల ప్రదర్శనలు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి ఆర్‌సీఎం విచారణ ఆధ్వర్యంలో పవిత్ర తపస్సు కాలంలో భాగంగా మానుకొమ్మల ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. తొలుత విచారణ కర్తలు రెవ. ఫాదర్ నూతలపాటి కిషోర్, విజయవాడ మేత్రాసనం గురువులు రెవ. ఫాదర్ సందీప్ నేతృత్వంలో భక్తులు మ్రానికొమ్మలను చేతపట్టుకుని గ్రామంలో ప్రదర్శన చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలతో పాటు దివ్యపూజబలిని సమర్పించారు. సంఘ పెద్దలు, మరియమాత దళ సభ్యులు, యువతి, యువకులు పాల్గొన్నారు. గన్నవరంలో ఆర్‌సీఎం విచారణ గురువులు రెవ. ఫాదర్ పసల థామస్ ఆధ్వర్యంలో మ్రానికొమ్మలతో ప్రదర్శన జరిపారు. బాలయేసు దేవాలయం నుంచి పురవీధుల్లో క్రీస్తును స్మరించుకుంటూ భక్తిగీతాలను ఆలపిస్తూ ప్రదర్శనను కొనసాగించారు. పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం

ఉయ్యూరు: మట్టల ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉయ్యూరు పట్టణంతో పాటు పలు మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రీస్తును స్మరిస్తూ మట్టలతో ర్యాలీ నిర్వహించారు. ఉయ్యూరు పట్టణంలోని సుగాలీ కాలనీలో బేతేలు మందిరం పాస్టర్ విజయ్‌రాజు ఆధ్వర్యంలో సండే స్కూల్ విద్యార్థులు మట్టల ఆదివారం ఆవశ్యకత తెలుపుతూ ర్యాలీ చేపట్టారు. సండే స్కూల్ టీచర్ కాగిత మీనాక్షి పర్యవేక్షించారు.

కంకిపాడు: మ్రాని కొమ్మల ఆదివారంను క్రీస్తు విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రమదినాల్లో భాగంగా ఆదివారం కంకిపాడు పట్టణంలోని ఆరోగ్యమాతా దేవాలయంలో విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ మువ్వల సాల్మన్‌రాజు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మ్రానికొమ్మలతో విశ్వాసులు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ప్రదర్శన చేపట్టారు. ఏసునామాన్ని జపిస్తూ విశ్వాసులు భక్తితో ముందుకు సాగారు. కార్యక్రమంలో సహాయ గురువు సిరాక్ అంబేడ్కర్, పలువురు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

బాపులపాడు మండలంలో...

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు మట్టల ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక జ్యోతినగర్‌లోని ఆర్సీఎం చర్చి ఫాదర్ జోసఫ్ తంబి ఆధ్వర్యంలో పెరికీడు సహాయమాత టవర్ నుంచి ప్రదర్శన చేశారు. క్రైస్తవులు చేతిలో మట్టలు పట్టుకుని జయహో హోసేన్నా అంటూ నినాదాలు చేశారు. జేఎంజే సిస్టర్లు అంథోనమ్మ, మంజుల పాల్గొన్నారు. బండారుగూడెం సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలోనూ మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు ప్రదర్శన నిర్వహించారు.


కంకిపాడులో ప్రత్యేక ప్రార్థనల్లో ఫాదర్ ఎం.సాల్మన్‌రాజు, విశ్వాసులు


మ్రానికొమ్మలతో కంకిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వాసులు


హనుమాన్‌జంక్షన్ ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవుల ప్రదర్శన

నూరు శాతం ఫీజు రాయితీ


విద్యార్థిని హర్షితకు బీటెక్ సీటు ఇస్తూ పత్రం అందచేస్తున్న వైస్ చాన్స్‌లర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: పోటీ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థినులకు ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభచాటడంతో వారికి కానూరు సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో ఫీజు రాయితీతో ఉచితంగా బీటెక్ సీటు ఇచ్చారు. ఈ మేరకు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి. వెంకటేశ్వరరావు ఆదివారం వివరాలు తెలుపుతూ జేఈఈ ప్రవేశ పరీక్షల్లో బొప్పన హర్షిత 97.88 శాతం, మాథా జోషితసుమ 97.27 శాతం మార్కులు సాధించి ప్రతిభ చాటారన్నారు. ఇద్దరు విద్యార్థినులకు సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్‌లో వంద శాతం ఫీజు లేకుండా(స్కాలర్‌షిప్) యాజమాన్యం సీటు ఇచ్చిందన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు తమ యూనివర్సిటీలో గుర్తించి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఉత్తమ ప్రతిభ చాటిన వారికి స్కాలర్‌షిప్‌లు అందచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.రాజేశ్వరరావు, డీన్ అడ్మిన్ ప్రొఫెసర్ జీఎన్.స్వామి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరంగమ్మ పేరంటాలు ఉత్సవాలు


భక్తులకు దర్శనమిస్తున్న శ్రీరంగమ్మ పేరంటాలు అమ్మవారు

గన్నవరం: ఉంగుటూరు మండలంలోని తేలప్రోలులో కొలువైన రంగమ్మ పేరంటాలు అమ్మవారి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణంలో కోలహల వాతావరణం నెలకొంది. తొలుత అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, ఊయల సేవ నిర్వహించారు. భారీగా తరలివచ్చిన భక్తులు శ్రీరంగమ్మ పేరంటాలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు ప్రభ బండ్లు, ట్రాక్టర్లతో వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీటి సరఫరాతో పాటు విశ్రాంత నిమిత్తం ఏర్పాట్లు చేశారు. ఈ నెల 16వ తేదీ రాత్రి వరకు అమ్మవారి ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీకి చెందిన జక్కా చంద్రశేఖర్, ఉదయ్, రమేష్ సోదరులు తెలిపారు.

పునాదిపాడు అండర్‌పాస్‌లో పేడ, వ్యర్థాలు


అండర్ పాస్ వద్ద జారిపడ్డ పేడ, ఇతర వ్యర్థాలు

కంకిపాడు: గుర్తు తెలియని వాహనం నుంచి జారిపడ్డ పేడ, ఇతర వ్యర్థాల గుట్ట ప్రమాదాలకు కారణమైంది. సుమారు 20 మందికి పైగా వాహనదారులు వ్యర్థాల గుట్టను చూసుకోకుండా వాహనాలను నడపటంతో జారిపడి గాయపడ్డారు. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. బైపాస్ మార్గంలో వాహనం నుంచి పేడ, వ్యర్థాల గుట్ట జారిపడింది. సర్వీసు రోడ్డుతో పాటు, అండర్‌పాస్‌మార్గం లోనూ వ్యర్థాల గుట్టలు పేరుకుపోయాయి. వ్యర్థాల గుట్టలు వాహనదారులకు కనిపించలేదు. దీంతో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించిన ద్విచక్రవాహనదారులు జారిపడి గాయపడ్డారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, తన అనుచరులతో కలిసి ఆ ప్రాంతానికి చేరుకుని సమస్య తీవ్రతను గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. రెవెన్యూ, పోలీసు శాఖల సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని పొక్లెయినర్‌తో వ్యర్థాల తొలగింపు పనులను చేపట్టారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఈడుపుగల్లు పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కంకిపాడు: ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. పాఠశాలలో 1990-91 విద్యాసం వత్సరం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తాము చదువుకున్న తరగతి గదుల్లో కలియతిరిగారు. స్నేహితులను ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకోవటంతో పాటుగా సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని వడ్డె పార్వతి, షేక్ రజియా, యక్కంటి రాణి, తాటిపర్తి సురేష్, పట్నాల గిరిధర్, అబ్దుల్ జాకీర్ హుస్సేన్, కలపాల కిరణ్ తదితరులు పర్యవేక్షించారు.

దివ్యాంగులకు అండగా లయన్స్ క్లబ్స్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): కృత్రిమ అవయవాలను అందజేస్తూ దివ్యాంగులకు తమ క్లబ్స్ అండగా ఉంటున్నాయని లయన్స్ ఇంటర్నేషనల్ (డిస్ట్రిక్ట్-316డీ) జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి చెప్పారు. స్థానిక సున్నపుబట్టీల సెంటర్‌లో ఉన్న ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) హాలులో లయన్స్ క్లబ్ (డిస్ట్రిక్ట్-316డీ) 27వ వార్షిక కన్వెన్షన్‌ను స్పందన పేరుతో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె శేషగిరి మాట్లాడుతూ దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేయడం ద్వారా వారు సాధారణ జీవితాన్ని పొందడమే కాకుండా కొన్ని వృత్తులు, ఉద్యోగాలు చేసూకుంటూ కుటుంబానికి అండగా ఉంటారని చెప్పారు. కృత్రిమ అవయవాలతో పాటుగా తోపుడుబండ్లు, ఇస్త్రీపెట్టెలు, కుట్టుమిషన్లు, రిక్షా బండ్లు ఇస్తూ.. ఇలా వారికి జీవనోపాధి కల్పిస్తున్నామన్నారు. వీవీపీఎస్ ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: అండర్-11 బాల, బాలికల జిల్లా స్థాయి చెస్ పోటీలు పోరంకిలోని విజ్ఞానభారతి హైస్కూల్‌లో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. బాలుర విభాగంలో 19, బాలికల విభాగంలో 13 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.ఎం.ఫణికుమార్ తెలిపారు. బాలుర విభాగంలో కె.సెండెన్‌సమావేద్, ఎం.కార్తికేయ, బాలికల విభాగంలో టి.ప్రణీత, వై.గుణశ్రీ వరుసగా ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు వెల్లడించారు. ఓపెన్ కేటగిరిలో రుషిల్‌సాయి, లలిత్‌కౌశిక్, సందీప్, మణిరత్నం విజేతలుగా నిలిచినట్లు ప్రకటించారు. విజేతలకు స్కూల్ డైరెక్టర్ కె.ఆర్.ఎస్.రావు, న్యాయవాది కె.అజయ్ కుమార్ సర్టిఫికెట్‌లు, బహుమతులు అందజేశారు.

250 మందికి వైద్య సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడరోడ్డులోని స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ స్వరాజ్యం, ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ పాలవరపు కల్యాణ చక్రధర్ పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు నిర్వహించారు. జనరల్ మెడిసిన్, రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 250 మందికి వైద్య సేవలు అందించినట్లు ట్రస్ట్ చైర్మన్ సత్యప్రసాద్, డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు.